సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 30 । జనవరి । 2023



పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. చలిగాలులు మాత్రం కొనసాగుతున్నాయి. 8లో



ప్రయాణం.. జర భద్రం

అంతర్రాష్ట్ర రహదారి అయిన మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. 8లో



గ్రామాల్లో విత్తనాల పండగ

వేడుకగా నిర్వహించే విత్తనాల పండగ సందడి గ్రామాల్లో నెలకొంది. సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్వహిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

పులి దాడిలో పశువుల మృతి

భయాందోళన చెందుతున్న గిరిజనులు



పులి దాడిలో మృతిచెందిన పశువు

అనంతగిరి: పెద్దపులి దాడిలో ఆదివారం రెండు పశువులు మృతి చెందినట్టు మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ చినకోనెల గ్రామానికి కోటపర్తి గంగులు తెలిపాడు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన పశువులపై పులి దాడి చేసి చంపేసిందని కన్నీరుమున్నీరుగా విలపించాడు. గత నెలరోజులుగా గ్రామ సమీపంలోని పెద్దపులి సంచరిస్తుందని, గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని, గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులు స్పందించి బాధిత రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా సత్తిబాబు, ప్రధాన కార్యదర్శిగా సీతారామరాజు



ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎన్నికల అధికారి

మహారాణిపేట: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.సత్తిబాబు, ప్రధాన కార్యదర్శిగా డి.సీతారామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒక్కొక్క పోస్టుకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్టు ఎన్నికల అధికారి పి.అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు మాట్లాడుతూ తనను మూడోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని అన్నారు. ఏమైనా సమస్యలుంటే జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, సీఈవో శ్రీరామ్మూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఎన్నికైన అధ్యక్షుడిని రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్ అభినందించారు. ఎన్నికల పరిశీలకుడిగా విజయనగరం జిల్లా అధ్యక్షుడు మురళీ, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, విజయనగరం జిల్లా ఎన్‌జీవో అధ్యక్షుడు సురేష్, సహాయ ఎన్నికల అధికారిగా యు. కూర్మారావు వ్యవహరించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా బీహెచ్‌వీ రమణబాబు, ఉపాధ్యక్షుడిగా ఆర్‌వీ నాగరాజు, యుఎస్‌వీ శ్రీనివాసరావు, ఎల్.పూర్ణయ్య, సంయుక్త కార్యదర్శులుగా కె.సత్యనారాయణ మూర్తి, కె.ఆనందకుమార్, వై.రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డీవీఎస్ గౌరీపతి రావు, వి.రాధ, డి.కొండలరావు, జేసీసీ మెంబర్‌గా సీహెచ్ ఫ్లోరెన్స్ నైటింగేల్, స్టేట్ కౌన్సిలర్లుగా జి.గంగాధర్, ఎ.సత్యనారాయణ, సీహెచ్ సింహాచలం, జీఎల్ నరసింహం, కోశాధికారిగా ఎస్.త్రినాథ్ తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను, సీఈవోను మర్యాదపూర్వకంగా కలిసింది.

తాపీమేస్త్రి ఆత్మహత్య

మతిస్థిమితం లేక బావిలో దూకి బలవన్మరణం



గణేశ్వరరావు మృతదేహం

పెదబయలు: మండలంలోని సీకరి పంచాయతీ వెల్లపాలెం గ్రామానికి చెందిన ముంచంగి గణేశ్వరరావు(45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 28న అర్ధరాత్రి రెండు గంటల తరువాత ఇదే పంచాయతీ పన్నెడ గ్రామ సమీపంలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. గణేశ్వరరావు తాపీ మేస్త్రిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నేపథ్యంలో 28 రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో నిద్రలేచి బయటకు వచ్చేశాడని, ఆదివారం మధ్యాహ్నం పన్నెడ బావిలో శవమై కనిపించాడని మృతుని బంధువులు ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని ఆయన వివరించారు. మృతుడికి భార్య, నలుగురు సంతానం ఉన్నారు.

పట్టుకుంటే బంగారమే!

మన్యంలో పట్టుసాగు సిరులు కురిపిస్తోంది. వాణిజ్య పంటల సాగు గిట్టుబాటు కాని రైతులంతా మల్బరీ సాగుపై దృష్టి సారిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. కోవిడ్ సమయంలో ధరలు పతనమైనా మార్కెట్ పరిస్థితులు మళ్లీ రైతులకు అనుకూలంగా ఉన్నాయి. ఏజెన్సీలో నేలలు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున రైతులు మంచి దిగుబడి సాధిస్తూ మెరుగైన ఆదాయం పొందుతున్నారు. పట్టు పరిశ్రమ చేపడితే రూ.లక్షలు ఆర్జించవచ్చని నిరూపిస్తున్నారు.

- రంపచోడవరం డివిజన్‌లో విస్తరిస్తున్న పట్టుపరిశ్రమ
- కోవిడ్ అనంతరం మెరుగుపడిన మార్కెట్ పరిస్థితులు
- లాభదాయకంగా ధర
- రూ.లక్షల ఆదాయం ఆర్జిస్తున్న రైతులు



కింద్రకాలనీలో మల్బరీ సాగులో మంచి ఫలితాలు సాధిస్తున్న ఆదర్శ మహిళా రైతు సత్యవతి

రాజవొమ్మంగి: మండలంలోని రైతులు మల్బరీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రంపచోడవరం డివిజన్‌లో 200 ఎకరాల్లో సాగవుతుండగా 150 ఎకరాలు మండలంలోనే సాగవుతోంది. ఎకరా విస్తీర్ణంలో మల్బరీ సాగు ద్వారా ఏడాదికి రూ.4.8 లక్షల విలువైన 600 కిలోల పట్టుగూళ్ల దిగుబడి సాధిస్తున్నారు. జిల్లాలో పట్టుపరిశ్రమపై కోవిడ్ ప్రభావం తీవ్రంగా చూపింది. పట్టుగూళ్లు కొనేవారు లేక పట్టుగుడ్లు (లేయింగ్స్) లభించక రెండేళ్లలో రంపచోడవరం డివిజన్‌లో 300 నుంచి 200 ఎకరాలకు సాగు తగ్గిపోయింది. అప్పటిలో పట్టుగూళ్ల ధర రూ.300కు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

మార్కెట్లో మెరుగైన పరిస్థితులు

కోవిడ్ ప్రభావం తగ్గిన తరువాత మార్కెట్లో పరిస్థితులు కాస్త మెరుగుపడ్డాయి. పట్టుగూళ్ల ధర కిలో రూ.600 నుంచి రూ.700 వరకు పెరిగింది. దీంతో మళ్లీ రైతులు సాగుపట్ల ఆసక్తి చూపుతున్నారు. ఆదాయం ఆశాజనకంగా ఉన్నందున మండలంలో 20 ఎకరాలు అదనంగా సాగు పెరిగింది వై.రామవరం మండలంలో 4, రంపచోడవరం మండలంలో 7 ఎకరాలు, అడ్డతీగలలో 4 ఎకరాల్లో కొత్తగా పంట వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని పట్టుపరిశ్రమశాఖ అధికారవర్గాలు తెలిపాయి. రంపచోడవరం డివిజన్‌లో ఉన్న గరప నేలలు మల్బరీ తోటల పెంపకానికి అనువైనవని పట్టుపరిశ్రమ శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. ఆరోగ్యవంతమైన మల్బరీ ఆకులు దిగుబడి వస్తున్నందున నాణ్యమైన పట్టు లభిస్తుందని వారు చెబుతున్నారు. ఇక్కడ ఉత్పత్తి చేసే పట్టుగూళ్లకు మార్కెట్లో మంచి ధర పలుకుతోందని చెప్పారు. ఇక్కడి పట్టుగూళ్లను హనుమాన్ జంక్షన్ మార్కెట్లో విక్రయిస్తున్నారు.

ఉత్తమ రైతుకు పురస్కారం

మండలంలోని కింద్రకాలనీకి చెందిన పామి చినసత్యవతి పట్టుపరిశ్రమలో మంచి ఫలితాలు సాధిస్తూ మిగతా రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తక్కువ విస్తీర్ణం సాగు చేపట్టిన ఈమె రికార్డు స్థాయిలో ఆదాయం పొందారు. ఎకరా విస్తీర్ణంలో సాగు చేపట్టి రూ॥4.25 లక్షల ఆదాయం పొందారు. ఈమెను ఇటీవల ఏలూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సిల్క్ బోర్డు అధికారులు సత్కరించారు.



షెడ్డులో పట్టు పురుగుల పెంపకం

వివరాలకు: రంగారావు,
అసిస్టెంట్ సెరికల్చర్ అధికారి, రంపచోడవరం
9652714914

వాణిజ్య పంటల కన్నా లాభం



రైతులు వాణిజ్య పంటల కన్నా మల్బరీ సాగు చేపట్టడం మంచిది. కోవిడ్‌లాంటి విపత్కర పరిస్థితుల వల్ల అప్పటిలో పట్టుగూళ్ల ధర పతనమైంది. అలాంటి పరిస్థితి మళ్లీ రైతులకు ఎదురుకాదు. అప్పటిలో కిలో రరూ.600 నుంచి రూ.300కు పోయింది. ఇప్పుడు ధర చాలా బాగుంది. పట్టుపరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చే రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, వ్యవసాయ సూచనలు అందించి ప్రోత్సహిస్తున్నాం. వచ్చే జూన్ నాటికి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

–రంగారావు, అసిస్టెంట్ సెరికల్చర్ అధికారి, రంపచోడవరం

• కొమ్మకొమ్మకు గుత్తులు



గులాబి జామి, రోజ్ వాటర్ బెర్రీ, జంబో ఫలం, లవ్ యాపిల్ ఇలా ఎన్నో పేర్లు ఉన్నా..పువ్వుల్లా ఆకర్షణీయంగా ఉండే ఈ పండ్లు స్థానికంగా ఓ రైతు ఇంటి పెరట్లో కనువిందు చేస్తున్నాయి. కేవలం కడియం, బుల్లంక వంటి నర్సరీలు, పొలాల్లో కనిపించే ఈ మొక్కను సూరంపాలెం గ్రామానికి చెందిన పల్లి వరహాలు ఏడేళ్ల క్రితం నాటారు. ఐదేళ్లుగా విరగ్గాస్తోంది. కొమ్మ కొమ్మకు గుత్తులతో కనువిందు చేస్తోంది. - రాజవొమ్మంగి

అందాల మహోదయం




వంజంగి హిల్స్‌పై ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

- పర్యాటక ప్రాంతాల్లో వీకెండ్ సందడి
- భారీగా తరలివచ్చిన సందర్శకులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం రద్దీగా మారాయి. చింతపల్లి మండలం లంబసింగి,తాజంగితో పాటు చెరువులవేనం మేఘాల కొండకు పర్యాటకులు భారీగానే తరలివచ్చారు.జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం,పాడేరు మండలం వంజంగి హిల్స్‌లోను పర్యాటకులు సందడి చేశారు.వంజంగిలోని సూర్యోదయం, పొగమంచు అందాలను పర్యాటకులు వీక్షించారు. డుంబ్రిగుడ, అరకులోయ, హుకుంపేట, అనంతగిరి, మాచ్‌ఖండ్ ప్రాంతాలను పర్యాటకులు సందర్శించారు.

బొర్రాకు పోటెత్తిన పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పెద్దఎత్తున తరలిరావడంతో గుహల ప్రాంగణంలోని సందడి వాతవరణం నెలకొంది. కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్, కటికి, తాటిగుడ, చిట్టంపాడు, సరియా జలపాతాలు తదితర సందర్శిత ప్రాంతాలు కళకళలాడాయి. ఆదివారం 3500 మంది పర్యాటకులు గుహలను తిలకించగా రూ. 2.78 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు.



సందర్శకులతో కళకళలాడుతున్న బొర్రా గుహలు



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం వద్ద ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సందడి చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలకు ఆదివారం సెలవు కావడంతో అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. జలపాతంలో కేరింతలు కొడుతూ గంటల తరబడి స్నానాలు చేశారు. పర్యాటకులు సెల్ఫీలు, ఫొటోలు దిగారు. కబాబుల అమ్మకాలు భారీగా జరిగాయి.

గోస్తనిపై వంతెనకు మోక్షం

గిరిజనుల కష్టాలకు తెరపడనుంది. ప్రాణాలను అరచేతితో పెట్టుకుని గోస్తనీనదిపై దాటుకుంటూ ప్రయాణాలు సాగించిన వారి సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం రూ.2 కోట్ల మేర నిధులు మంజూరుచేసింది. వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ పనులకు నేడు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శంకుస్థాపన చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

- సారవానిపాలెం వద్ద నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు
- నేడు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శంకుస్థాపన
- 60 గ్రామాల గిరిజనుల్లో ఆనందం



ప్రమాదకర పరిస్థితుల్లో గోస్తనీ నది ప్రవాహంలోంచి రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ సారవానిపాలెం గ్రామ సమీపంలోని గోస్తనీ నదిపై 2 కోట్లతో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 2014 హుద్‌హుద్ తుఫాన్‌కు గెడ్డలు పొంగి ప్రవహించాయి. వీటి ఉధృతికి సారవానిపాలెం గ్రామ సమీపంలోని గోస్తనీనదిపై ఉన్న కాజ్‌వే కొట్టుకుపోయింది. అప్పటినుంచి గ్రామాలకు వెళ్లేందుకు గిరిజనులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మాణం చేపట్టాలని గత ప్రభుత్వ హయాంలో గిరిజనులు కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో, అరకు-విశాఖ ప్రధాన రహదారిలో గిరిజనులు ఆందోళన చేపట్టారు. అయినప్పటికీ టీడీపీ ప్రభుత్వం స్పందించలేదు. సారవానిపాలెం గ్రామంలో పర్యటించినప్పుడల్లా ఆయన దృష్టికి పంచాయతీ పరిధిలోని గిరిజనులు వంతెన సమస్యను తీసుకువచ్చేవారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్‌సీఏ గ్రాంటులో నిధులు మంజూరుకు కృషి చేశారు. వంతెన నిర్మాణం వల్ల భీంపోల్, గుమ్మకోట, గరుగుబిల్లి పంచాయతీల్లో సుమారు 60 గిరిజన గ్రామాలకు మేలు జరుగుతుంది.



గెడ్డల ఉధృతికి కొట్టుకుపోయిన కాజ్‌వే (ఫైల్)

నరకయాతన పడ్డాం

హుద్‌హుద్ తుపానులో కాజ్‌వే కొట్టుకుపోవడంతో నరకయాతన అనుభవించాం. సమస్యను స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకువెళ్లాం. వెంటనే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరుకు కృషి చేశారు. ఆయన చొరవ చూపడంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయింది.

– సన్యాసిరావు, కాశీపట్నం ఎంపీటీసీ

త్వరితగతిన పూర్తిచేస్తాం

సారవానిపాలెం గోస్తనీనదిపై వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం. వంతెన నిర్మాణం పూర్తయితే మూడు పంచాయతీల పరిధిలో సుమారు 60 గ్రామాల ప్రజల కష్టాలు తీరినట్టే. సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లిన వెంటనే నిధులు మంజూరు అయ్యాయి.

– గణేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ, అనంతగిరి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా



గ్రామస్తులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నా. గిరిజనులు పడుతున్న కష్టాలను కళ్లారా చూసి చలించిపోయా. వెంటనే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లా. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు ఎంతో ఆనందంగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, గిరిజనులందరి తరఫున రుణపడి ఉంటా.

–చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

అంబరాన్నంటిన సంబరం

- ఘనంగా మోదకొండమ్మ తీర్థ మహోత్సవం
- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహణ

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మతల్లి తీర్థ మహోత్సవం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి తరువాత నిర్వహిస్తుంటారు. వేకువజామునుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయకమిటీ చైర్‌పర్సన్, స్థానిక ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, భక్తుల సహకారంతో ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీస్థాయిలో నిర్వహించిన అన్నసమారాధనలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నర్సింగరావు తదితరులు

ఘనంగా సారె ఊరేగింపు

పట్టణంలోని కాపుసామాజిక వర్గం ఆధ్వర్యంలో మహిళలు మోదకొండమ్మ అమ్మవారికి సారెను ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు. డాక్టర్ నర్సింగరావు, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సారె ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి సమర్పించారు.

పురవీధుల్లో ఊరేగింపు

తీర్థ మహోత్సవం పురస్కరించుకుని అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పాడేరు పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నర్సింగరావు, వైస్ ఎంపీపీ గంగపూజారి శివ, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ బూరెడ్డి రాములు అమ్మవారి విగ్రహాన్ని ఆలయం చుట్టూ మూడు సార్లు తిప్పి పల్లకిలో కొలువుదీర్చారు. ఊరేగింపులో వారు కూడా పల్లకీని మోశారు. తీన్‌మార్ బ్యాండ్ ,పలు వేషాలు,డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బాణసంచా కాల్పులు, విద్యుత్ దీపాల అలంకరణ ఆకట్టుకున్నాయి. అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, చింతలవీధి ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి, గుడెపు ఉషారాణి, మాజీ సర్పంచ్‌లు వి.పిన్నయ్యదొర, మినుముల కన్నాపాత్రుడు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు కె.కొండాజీ, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సారెను తీసుకువస్తున్న ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తదితరులు



అమ్మవారి ఆలయానికి సారెను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు





అమ్మవారి ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషాలు



సంబరంలో తీన్‌మార్ బ్యాండ్

జీవ వైవిధ్యం.. సాహస కృత్యం

- తూర్పు కనుమల పరిరక్షణకు అటవీశాఖ ప్రణాళికలు
- కంబాల కొండలో ప్రయోగాత్మకంగా అమలుకు శ్రీకారం
- బయోడైవర్సిటీ పార్క్, ఆర్కిడేరియం, ఔషధమొక్కల పార్కు ఏర్పాటు
- రూ.90 లక్షలతో మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని నిర్ణయం

సాక్షి, విశాఖపట్నం : వాతావరణ సమతుల్యతను కాపాడటం, జీవ వైవిధ్యాన్ని పెంపొందిం చడంలో తూర్పు కనుమలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. నైరుతి, ఈశాన్య రుతు పవనాల గమనంలోనూ వీటి పాత్ర ఎంతో కీలకం. మన రాష్ట్రానికి జీవనాడులుగా ఉన్న కృష్ణా, గోదావరి సహా అనేక నదుల్లో నీరు చేరడానికి ఈ పర్వత శ్రేణులు ఎంతగానో దోహదపడుతున్నాయి. అలాంటి తూర్పు కనుమల్లో అటవీ, వన్యప్రాణి సంపద వేగంగా కనుమరుగవుతూ ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి నడుం బిగించింది. మిషన్ కన్జర్వ్ ఈస్టర్న్ ఘాట్స్ పేరుతో జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంతో పాటు సాహసకృత్యాలకు కేంద్ర బిందువుగానూ, వన్యప్రాణులు సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అటవీ శాఖ ప్రత్యేక ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. తూర్పు కనుమలు హిమాలయాల కంటే పురాతన పర్వత శ్రేణులు మన రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి చిత్తూరు జిల్లా వరకు విస్తరించి ఉన్నాయి. గత వందేళ్ల కాలంలో ఈస్టర్న్ ఘాట్‌లో 16 శాతం మేర అటవీ సంపద క్షీణించింది. దీన్ని అధిగమిస్తూ కనుమలను పరిరక్షించేందుకు మిషన్ కన్జర్వ్ ఈస్టర్న్ ఘాట్ పేరుతో రాష్ట్ర అటవీ శాఖ నడుంబిగిస్తూ పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రూ.90 లక్షలతో కంబాల కొండలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. విశాఖ నగరం, చుట్టుపక్కల అడవుల్లో పచ్చదనంతో పాటు జీవవైవిధ్యాన్ని పెంపొందించడం.. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో ప్రజల్లో అవగాహన పెంపొందించడం మొదలైన కార్యక్రమాలకు కేంద్రంగా మారుతోంది.


సిద్ధమవుతున్న ప్రకృతి వివరణ కేంద్రం

'ప్రకృతి' ఒడిలో 'వివరణ' కేంద్రం..

సెంట్రల్ నర్సరీలో ప్రస్తుతం ఉన్న భవనం ప్రకృతి వివరణ కేంద్రంగా పునరుద్ధరించనున్నారు. ఇది తూర్పు కనుమలు, కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యంలోని పుష్పజాతులు, జంతుజాలం ఇతర ప్రాణుల గురించి విశదీకరించనుంది. గిరిజనులు, నదులు, పర్యావరణ వ్యవస్థ పనితీరుపై ఆధారపడిన నమూనాలు, తూర్పు కనుమలలోని మడ, సాధారణ అడవులు, గిరిజనుల జాతి-వృక్ష శాస్త్రం మొదలైన వివరాలని అందిస్తుంది. సహజమైన తూర్పు కనుమల పర్యావరణ వ్యవస్థకు సంబంధించిన వాస్తవిక చిత్రాన్ని ప్రదర్శించడానికి చెట్ల ఫెర్న్‌లు, గడ్డి, ఇతర స్థానిక వృక్షజాలంతో ప్రత్యక్ష నమూనా కూడా ఏర్పాటు చేస్తారు. ఏపీలో ఈ తరహా కేంద్రం ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం. తూర్పు కనుమల జీవవైవిధ్యానికి ఎదురవుతున్న ముప్పుపై ప్రజలను చైతన్యవంతులను చేయడమే దీని లక్ష్యం.

అంచనా వ్యయం	: రూ.90 లక్షలు
ఎప్పటిలోగా పూర్తి చేస్తారు	: 2023 జూలై
ఎవరు చేస్తున్నారు	: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో అటవీ శాఖ


తయారుచేసిన ఈస్టర్న్ ఘాట్స్ నమూనాలు

అద్భుతాల ఆర్కేడియం

తూర్పు కనుమలలో గ్యాంబుల్, ఫిషర్, మాథ్యూ, హెన్రీ తదితర 66 జాతులకు చెందిన 199 ఆర్కిడ్ జాతులున్నట్లు గుర్తించారు. కీటకాలు, పక్షులు, గబ్బిలాలకు తేనె, పుప్పొడి, పండ్లు, విత్తనాలు వంటి ఆహార వనరులను ఈ అర్కిడ్ వృక్షజాతులు అందిస్తాయి. ప్రపంచంలోని 1256 ఆర్కిడ్ జాతులలో 307 భారత్‌కు చెందినవే. తూర్పు కనుమల్లోని కొన్ని ఉష్ణమండల ప్రాంతాలు ఆర్కిడ్‌లకు నిలయంగా ఉన్నాయి. ఈ జాతులను సంరక్షిస్తూ పెంచేందుకు ఆర్కేడియాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆర్కేడియంలో బుల్బోఫిలమ్ వెస్టిటా, హబినారియా పానిగ్రాహియానా, లిపారిస్ పియోని మొదలైన కొన్ని స్థానిక ఆర్కిడ్‌ల మనుగడకు ప్రయోజనం చేకూర్చేలా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేకమైన పుష్పాలను అందించే ఆర్కిడ్‌ల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తారు.


ఆర్కిడేరియం పనులను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

సాహసాలతో జీవవైవిధ్య పార్కు

ఆధునికీకరణ ప్రభావంతో జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లుతున్న తరుణంలో తూర్పు కనుమల్లో వాటిని సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇందుకోసం బయోడైవర్సిటీ పార్కు ఏర్పాటు చేయనున్నారు. జీవ వైవిధ్య పార్కుతో పాటు కంబాల కొండ సాహస కృత్యాలకు నెలవుగా ట్రెక్కింగ్, ట్రయల్స్‌తో ఫికస్టేరియంని కూడా నిర్మించనున్నారు. ఈ కేంద్రం వాకర్స్‌కు స్వర్గధామంగానూ, అభ్యాసన కేంద్రంగా మారనుంది. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న యానిమల్ రెస్క్యూ సెంటర్ నుంచి తూర్పు కనుమల జీవ వైవిధ్య కేంద్రం వరకూ యానిమల్ సఫారీ కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో పాటుగా ఇందిరా గాంధీ జూ పార్క్ నుంచి కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యం వరకూ వైల్డ్ డాగ్ రీస్టాకింగ్ కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టనున్నారు.
ప్రాజెక్టు : కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యంలో తూర్పు కనుమల జీవవైవిధ్య కేంద్రం

ఏమేం చేయబోతున్నారంటే...

ప్రణాళిక	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)
ప్రకృతి వివరణ కేంద్రం	45
ఔషధ మొక్కల బృందావనం	20
ఆర్కిడేరియం	20
పోస్టర్లు, పబ్లిసిటీ	05
మొత్తం	90


సిద్ధమవుతున్న ఔషధవనం

ఈస్ట్రన్ ఘాట్స్‌తోనే మనందరి భవిష్యత్తు..

తూర్పు కనుమల భవిష్యత్తుతోనే మన భవిష్యత్ ముడిపడి ఉంది. రాజీ లేకుండా అడవులను పరిరక్షించాలి. పశ్చిమ కనుమలు, హిమాలయాల మాదిరిగానే తూర్పు కనుమల ప్రాంతం జీవ వైవిధ్యానికి హాట్‌స్పాట్‌గా ఉంది. అందుకే ఈస్టర్న్ ఘాట్స్‌ను సంరక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక వృక్ష, జంతుజాల స్థితిపై సర్వేలను ప్రారంభించి.. వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టనున్నాం. విత్తనాల సేకరణ, నర్సరీల పెంపకం, మొక్కల పెంపకాన్ని దత్తత తీసుకోవడం, పెరిగిన జాతులను సమర్థవంతంగా పర్యవేక్షించడం వంటి వివిధ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాం.

– అనంతశంకర్, డీఎఫ్‌వో, విశాఖపట్నం

క్లుప్తంగా

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- సాయంత్రం నుంచి చలిగాలులు
- ఉదయం 10 గంటల వరకు వీడని మంచు తెరలు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఆదివారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 8.5 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 10 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 10.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏజెన్సీ వ్యాప్తంగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. సాయంత్రం ఆరుగంటల నుంచి చలిగాలులు నెలకొన్నాయి.

డిప్యూటీ సీఎంను కలిసిన శెట్టి


ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడును కలిసిన గంగాధరస్వామి

సాక్షి,పాడేరు: డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడును ఆదివారం అరకు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి కలిశారు.అరకు నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరినట్టు గంగాధరస్వామి తెలిపారు.

హుండీలో నగదు చోరీ


దొంగలు పగులగొట్టిన హుండీ

కోటవురట్ల: రామచంద్రపురం శివారు నూకాలమ్మతల్లి ఆలయంలో హుండీలో నగదు చోరీకి గురైందని గ్రామ పెద్దలు చిన్న, పులి చంటి తెలిపారు. దొంగలు హుండీని పగులగొట్టి భక్తులు వేసిన కానుకలను అపహరించుకుపోయారని తెలిపారు. ఇలా తరచూ హుండీలో నగదు చోరీకి గురవుతోందని, ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరా ఏర్పాటుకు దాతలు సహకరించాలని కోరారు. కాగా ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

గ్రామాల్లో విత్తనాల పండగ


తీయమామిడిలో విత్తనాల పండగ సందర్భంగా థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు, వేడుకలో వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ కృష్ణవంశీ తదితరులు

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రా పంచాయతీ గొందిగుడ గ్రామంలో విత్తనాల పండుగను ఆదివారం ప్రారంభించారు. కొండ దేవతకు వారం రోజుల వరకు ప్రత్యేక పూజలు చేసి, వారం రోజుల పాటు వేడుక నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గ్రామస్తులు ఇంటింటికీ వెళ్లి థింసా నృత్యాలతో ఊరేగింపు చేపట్టి బియ్యం, నిత్యావసర సరకులు సేకరిస్తారు. వారం రోజుల పాటు పండగ జరుపుతారు.

భావి తరాలకు ఆదర్శంగా గిరిజన సంస్కృతి

గూడెంకొత్తవీధి: గిరిజనులు అనాదిగా ఆచరిస్తున్న ఆచార, సంప్రదాయాలు భావి తరాలకు ఒక దిక్సూచి, ఆదర్శంగా నిలుస్తాయని మండల వైస్ ఎంపీపీ సప్పగడ్డ ఆనంద్, పెదవలస సర్పంచ్ కృష్ణవంశీ అన్నారు. రంపుల వీధిలోని తీయమామిడి గ్రామంలో ఆదివారం విత్తనాల పండగను స్థానిక గిరిజనులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన యువతీ, యువకులు థింసా నృత్యాలు, కోలాటాలు వంటివి ఆడి సందడి చేశారు. గిరిజనులు సంప్రదాయం పేరుతో జరిపే ప్రతి పండగ వెనుక ఒక శాస్త్రీయత, ఉంటుందని నాయకులు అన్నారు. రానురాను సంప్రదాయాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో గిరిజనులు ఇప్పటికీ వాటిని ఆచరించడం స్వాగతించాల్సిందేనన్నారు. సచివాల కన్వీనర్ రమేష్ వార్డు సభ్యులు రాంబాబు, దొరబాబు, నాని, శరభన్నపడాల్, మాజీ సర్పంచ్‌లు భాస్కర్ వర్తకసంఘం నాయకులు మహమ్మద్ పాల్గొన్నారు.

గిరిజన యువత సంఘటితమే లక్ష్యం

- నెహ్రూ యువ కేంద్రం తెలుగు రాష్ట్రాల డైరెక్టర్ విజయరావు
- 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం ప్రారంభం


కార్యక్రమం ప్రారంభిస్తున్న స్టేట్ డైరెక్టర్ ఎఆర్ విజయరావు తదితరులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్టేట్ డైరెక్టర్ విజయరావు

కొమ్మాది(భీమిలి): దేశం నలుమూలల ఉన్న గిరిజన యువతను సంఘటితం చేస్తూ వారిలో ప్రతిభను వెలికి తీసేందుకు ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం దోహదపడుతుందని నెహ్రూ యువ కేంద్రం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టర్ ఏఆర్ విజయరావు తెలిపారు. గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో ఆదివారం భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం నిర్వహిస్తున్న ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజన యువతీ, యువకులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజయరావు మాట్లాడుతూ గిరిజన యువతకు కంప్యూటర్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చి, ఉన్నత స్థానంలో నిలబెట్టాలన్నారు. చత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి 200 మంది గిరిజన యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. వీరికి వారం రోజుల పాటు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు కూడా ఉంటాయి. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఆశకుమారి, ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, జీవీపీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రజిని, తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఇంటర్ డిస్ట్రిక్ట్ బాక్సింగ్ పోటీల విజేత నర్సీపట్నం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నింజాస్ అకాడమీ డైరెక్టర్లు నారాయణరావు, సుమ

నర్సీపట్నం: నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఇంటర్ డిస్ట్రిక్ బాక్సింగ్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో రాజమండ్రి, తుని, గాజువాక, గొలుగొండ, నర్సీపట్నం పరిసర మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలకు సీనియర్ కోచ్ శేఖర్, రిఫరీ కోచ్ మౌనిక వ్యవహరించారు. ఈ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన క్రీడాకారులు ప్రథమ స్థానం, రాజమండ్రి క్రీడాకారులు ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్ సైకాల జిస్టు సుమ బహుమతులు అందజేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పీడీలు లక్ష్మి, అచ్చమ్మ, దేవిలను ఘనంగా సత్కరించారు.

ప్రయాణం.. జర భద్రం

అసలే ఘాట్.. అందులోనూ ఇరుకు రోడ్డు.. చుట్టుపక్కల పెద్ద పెద్ద లోయలు.. అలాంటి మార్గంలో వాహనాలకు ప్రమాదాలు జరిగినా.. మరమ్మతుకు గురైనా వాహన రాకపోకలు నిలిచిపోవడమే కాదు.. గంటలు.. రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిందే.. ఇదీ అంతరాష్ట్ర రహదారి మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో ప్రయాణం పరిస్థితి.

- ప్రమాదాలకు నిలయంగా మారిన ఘాట్‌రోడ్డు
- మారేడుమిల్లి-చింతూరు రోడ్డులో తరచూ ట్రాఫిక్ జామ్
- రహదారి విస్తరించాలని కోరుతున్న ప్రయాణికులు



హెచ్చరిక బోర్డు


వాలీ సుగ్రీవ్ మలుపు వద్ద మరమ్మతుల కారణంగా నిలిచిపోయిన లారీ

మారేడుమిల్లి : అంత ర్రాష్ట రహదారి అయిన మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డు అధ్వానంగా మారడంతో ఇటీవల కాలంలో ప్రమాదాల సంఖ్య పెరిగింది. ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలను అధికారులు నిషేధించారు. అయినా పట్టించుకోవడం లేదు. ఈ ఘాట్ మార్గంలో మారేడుమిల్లి మీదుగా తెలంగాణ, చత్తీస్‌గఢ్, ఒడిశా, రాష్ట్రాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

వాలీ సుగ్రీవ్ మలుపులో

మారేడుమిల్లి-చింతూరు ఘాట్‌లోని వాలీ సుగ్రీవ్ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఈ ప్రాంతంలో మోతుగూడెం జెన్‌కో ఇంజినీర్ కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో మృతి చెందారు. తీర్థయాత్రలకు భద్రాచలం వెళ్లి వస్తున్న బస్సు మలుపులో అదుపుతప్పి లోయలోకి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు. ఊకలోడుతో వెళ్తున్న లారీ ప్రమాదానికి గురి కావడంతో మంటలు చెలరేగి దగ్ధమైంది. వాలీ సుగ్రీవ్ మలుపు ఇరుకుగా ఎత్తులో ఉన్నందున భారీ వాహనాలు ఇబ్బందులు పడుతుంటాయి.

తరుచూ ఇబ్బందులు

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు తరచూ సంభవిస్తూనే ఉంటున్నాయి. అడవి మాధ్యంలో ట్రాఫిక్ నిలిచిపోతే అంతే ఆర్టీసీ బస్సులు, వాహనాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు రోడ్డు మీదే గంటల తరబడి పడిగాపులు కాస్తూ నిరీక్షిస్తున్నారు. ఏమి చేయాలో అర్థం కాక వెనక్కి తిరిగి వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నారు. చంటి పిల్లల తల్లులు, మహిళలు ఇబ్బందులు అయితే అన్నీ ఇన్నీ కాదు ఇప్పటికైనా ఇరు రాష్ట్ర అధికారులు స్పందించి ఘాట్ రోడ్డు విస్తరణ చేయాలని ప్రజలు, వాహనాదారులు కోరుతున్నారు.

కానరాని రక్షణ గోడలు

మారేడుమిల్లి నుంచి చింతూరుకు 30 కిలోమీటర్లు మేర ఘాట్ రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డులో పెద్ద, పెద్ద మలుపు ఉన్నాయి. ఈ ఘాట్ రోడ్డు అంతసేపు వాహనాలు అతి కష్టమీద ప్రయాణిస్తాయి. అయితే మలుపులు వద్ద ఎక్కడ కూడా రక్షణ గోడలు లేవు. హెచ్చరిక బోర్డులు, ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రమాదాలు తరుచు సంభవిస్తున్నాయి. ఘాట్ రోడ్డులో రహదారికి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మిస్తే కొంత వరకు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందని పలువురు చెబుతున్నారు.

నిబంధనలు బేఖాతరు

మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తూ మలుపుల్లో మరమ్మతులు , ప్రమాదాలకు గురవుతున్నాయి. తరుచూ ఇటువంటి సంఘటనలు జరిగి. ఈ మార్గంలో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఘాట్ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు నిషేధించారు. 15 మీటర్లు పొడవు, 37 టన్నుల బరువు ఉన్న వాహనాల రాకపోకలు నిషేధిస్తూ రవాణ శాఖ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిన వీటిని వాహనాదారులు ఎవరూ కూడా పట్టించుకోవడం లేదు. రాకపోకలు కొనసాగుతునే ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో తరుచూ జరుగుతున్న ప్రమాదాల పట్ల తగు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పాములేరు గ్రామం నుంచి అమృతధార వరకు ఘాటరోడ్డులో రహదారి మరమ్మతు పనులు చేపట్టాం. రోడ్డుకు ఇరువైపులా రక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం.

–ప్రదీప్, జేఈ (ఆర్అండ్‌బీ), రంపచోడవరం